

- జిల్లాలో కొనసాగుతున్న వరి కోతలు
- రోడ్ల వెంట ధాన్యం రాశులు
- అమ్మకాలకు రైతుల ఎదురు చూపులు
- జిల్లా వ్యాప్తంగా 400 కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు నిర్ణయం
- ప్రైవేటు వ్యాపారులకు అమ్మేందుకు సిద్ధమవుతున్న కొందరు రైతులు



• హార్వెస్టర్ సాయంతో పంటను కోస్తున్న దృశ్యం



జోరుగా వరి కోతలు

నిజామాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైతులు యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పంట కోతలు జోరందుకున్నాయి. ఏ గ్రామంలో చూసినా ధాన్యం కుప్పలే దర్శనమిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం కావడంతో రైతులు పంటచేనులు, రోడ్ల వెంట ధాన్యాన్ని ఆరబోసి ఉంచుతున్నారు. ఇప్పుడిప్పుడే కొనుగోలు కేంద్రాలను తెరవడంతో రైతులు ధాన్యాన్ని అమ్మేందుకు సిద్ధమవుతున్నారు. కొంత మంది రైతులు కొనుగోలు ఆలస్యం అయ్యే అవకాశం ఉండటంతో వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వరి సాగు చేసిన అన్ని గ్రామాల పరిధిలో కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభిస్తున్నారు. ప్రతిరోజూ 10వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, వాహనాలు, హమాలీలను సమకూర్చి రెండు నెలల్లో పూర్తిచేసే విధంగా ఏర్పాట్లు చేశారు.

4లక్షల 6వేల ఎకరాలకు పైగా సాగు

జిల్లాలో ఈ యాసంగిలో 4లక్షల 6వేల ఎకరాలకు పైగా వరిసాగు అయ్యింది. జిల్లాలోని అన్ని గ్రామాల పరిధిలో వరి సాగు చేశారు. కొన్ని గ్రామాలను మినహాయిస్తే మెజార్టీ గ్రామాల్లో ఈ దఫా రైతులు వరి వేశారు. ఈ యాసంగిలో భూగర్భ జలాలు ఎక్కువగా ఉండటం వరి వేసే సమయంలో ప్రాజెక్టుల్లో నీళ్లు ఉండటం వల్ల రైతులు మొగ్గు చూపారు. భారీ స్థాయిలో పంట వేశారు. ప్రభుత్వం కూడా వ్యవసాయినికి విద్యుత్ సరఫరా చేయడంతో వరిసాగును ఎక్కువగా చేశారు. బోర్లు, చెరువులతో పాటు ప్రాజెక్టుల కింద ఎక్కువగా ఈ పంటను వేశారు. జిల్లా వ్యాప్తంగా వరిసాగు కాగా ఎక్కువ మొత్తంలో సన్న రకాలను వేశారు. వరి సాగును ముందుగానే మొదలు పెట్టడం వల్ల 60 శాతానికి పైగా పంట చేతికి వస్తుంది. ఎండలు బాగా ఉండటం వల్ల రైతులు కూడా వరికోతల్లో నిమగ్నమయ్యారు. కోతలు పూర్తికాగానే అమ్మకాలు చేస్తున్నారు.

కొనసాగుతున్న కోతలు

జిల్లాలో గడిచిన ఇరవై రోజులకు పైగా రైతులు వరికోతలు చేస్తున్నారు. జిల్లాలోని కొన్ని మండలాల పరిధిలో ముందస్తుగా వరినాట్లు వేయడం వల్ల పంట చేతికివచ్చింది. భారీ సంఖ్యలో వరిసాగు చేయడం వల్ల రైతులు కోసిన ధాన్యాన్ని ఆయా గ్రామాల పరిధిలో పంటచేనులు, రోడ్ల వెంట ఆరబోస్తున్నారు. పూర్తిస్థాయిలో పంటలు చేతికి వస్తుండటంతో అమ్మకాలకు సిద్ధమవుతున్నారు. బోధన్ డివిజన్ పరిధిలో ముందే కోయడం వల్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో గడిచిన ఇరవై రోజులుగా వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారు. క్వింటాల్ రూ.1900 నుంచి 2వేల మధ్య అమ్మకాలను చేస్తున్నారు. పంట చేను వద్దనే ధాన్యాన్ని అమ్ముతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం వల్ల రైతులు తప్పని పరిస్థితుల్లో వ్యాపారులకు అమ్మకాలను చేశారు. మద్దతు ధర కన్న తక్కువగా వచ్చిన వర్షాలను దృష్టిలో పెట్టుకొని అమ్మకాలను చేశారు. కొంత మంది రైతులు జిల్లాలోని మిల్లర్లతో పాటు ఇతర రాష్ట్రాల వ్యాపారులకు కూడా అమ్మకాలను చేస్తున్నారు. మొదట క్వింటాలు మద్దతుధరకు కన్న ఎక్కువ రేటుకు కొనుగోలు చేసిన వ్యాపారులు కొనుగోలు కేంద్రం ఆలస్యం కావడంతో వ్యాపారులకు అమ్మకాలను చేశారు. గడిచిన ఐదు రోజుల నుంచి జిల్లాలో కొనుగోలు కేంద్రాలను అధికారులు మొదలు పెట్టడంతో రైతులంతా ధాన్యాన్ని రోడ్లు, పంటచేనుల వద్దనే ఆర బోసి ఉంచుతున్నారు. కొనుగోలు కేంద్రాలను మొదలు పెట్టగానే పూర్తిస్థాయిలో అమ్మకాలను చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. అన్ని కేంద్రాలు ప్రారంభమవుతుండటంతో రైతులు కూడా వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నారు. వారం రోజుల పాటు ఆగి కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మేందుకు సిద్ధమవుతున్నారు.

రోడ్ల వెంట ధాన్యం కుప్పలు

ధాన్యాన్ని మొత్తం రోడ్లు, పంటచేనుల వద్ద కుప్పలు పోసి నిలువ ఉంచుతున్నారు. వర్షాలు వచ్చే అవకాశం ఉండటంతో టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచుకుంటున్నారు. వ్యాపారులు మద్దతు ధరకు మించి ధర పెడితే అమ్మేందుకు సన్నద్ధమవుతున్నారు. కొంత మంది రైతులు ధాన్యాన్ని మంచి రేటు వస్తే వ్యాపారులకు అమ్మకాలను చేస్తున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తూనే అధికారులు ప్రతిరోజూ 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నెలలో 2లక్షల 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మే నెలలో మొత్తం ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు వెంట వెంటనే తరలించే విధంగా గన్నీ బ్యాగులను సమకూర్చారు. వాహనాలను ఏర్పాట్లు చేశారు. కొనుగోలు పూర్తి కాగానే కేటాయించిన రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు చేపట్టామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాశ్, సంస్థ జిల్లా మేనేజర్ జగదీశ్వర్‌లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం..

జిల్లాలో ఐదు రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అధికారులు ప్రస్తుతం అన్ని గ్రామాల పరిధిలో ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ఈ దఫా 11.72లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 468 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రూపొందించారు. ఇప్పటి వరకు అధికారికంగా 400 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొద్ది మొత్తంలో ధాన్యాన్ని ప్రతి రోజూ కొనుగోలు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో క్వింటాలు ఏగ్రేడ్ 2203 రూపాయలు, సాధారణ రకం 2183 రూపాయలకు కొంటున్నారు.

ఓట్ల కోసమే దిగజారుడు రాజకీయాలు

- రాష్ట్రంలో ఎన్ఆర్‌సీ, సీసీఏ అమలు చేసేది లేదని.. మంత్రి ఉత్తమ్ ఏ అధికారంతో ప్రకటనలు చేస్తున్నారు ? : ఎంపీ ధర్మపురి అర్వింద్

పెద్దబజార్, ఏప్రిల్ 3: పార్లమెంట్ నిర్ణయాలను గౌరవించాల్సిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. ఓ వర్గం ఓట్ల కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. బుధవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్ఆర్‌సీ (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్), సీసీఏ (సిటిజన్‌షిప్ అమెన్డ్‌మెంట్ యాక్ట్) అమలు చేసేది లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటనలు చేస్తున్నారని.. ఆయన ఏ అధికారంతో ఈ విషయం మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇలాంటి ప్రచారాలను చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. మంత్రి హోదాలో ఆయన చేసిన వ్యాఖ్యలు దేశద్రోహం కింద వస్తాయని అన్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేసిన మంత్రికి ఈ విషయాలు తెలియవా!? అని ఆయన ప్రశ్నించారు. ఆయన మాటలు రోహింగ్యాలకు అడ్డాగా మారే విధంగా ఉన్నాయన్నారు. ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్న ఉత్తమ్‌పై ఫిర్యాదు చేస్తామన్నారు. సిటిజన్ సిటీ యాక్టు నెహ్రూ హయాంలోనే పెట్టిందన్నారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డి కూడా ఇదే విధమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించి బుద్ధి చెప్పాలని అర్వింద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, ఇతర నేతలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్



పాల కేంద్రం ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు

రోడ్డెక్కిన పాడి రైతులు

- మూడు నెలలుగా రైతులకు అందని బిల్లులు
- తక్షణమే చెల్లించాలని డిమాండ్

కోటగిరి, ఏప్రిల్ 3: ప్రభుత్వ డెయిరీలకు పాలు పోసే రైతులకు సమస్యలు తప్పడం లేదు. ప్రభుత్వ డెయిరీ నుంచి రావాల్సిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో పాడి రైతులు రోడ్డెక్కారు. మండల కేంద్రంలో విజయ డెయిరీ పాడి రైతులు బుధవారం ఉదయాన్నే పాలకేంద్రం వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. కేంద్రంలో పాలు పోసే రైతులకు మూడు నెలలుగా బిల్లులు అందడం లేదు. కేంద్రంలో సుమారు 60మంది రైతులు పాలు పోస్తున్నారు. నెలకు సుమారు రూ.2లక్షలకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. మొత్తం రూ.10లక్షలకు పైగా బకాయిలు ఉండడంతో తాము విజయ డెయిరీకి పాలు ఎలా పోయాలని రైతులు ప్రశ్నించారు. పాడి పశువులపై బ్యాంకు రుణాలు, ప్రైవేటు రుణాలు తీసుకున్నామని రైతులు తెలిపారు. బిల్లులు రాకపోవడంతో రుణాలు చెల్లించలేని పరిస్థితి తలెత్తిందని వాపోయారు. పశువులకు దాణా పెట్టేందుకు వేలాది రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొన్నారు. బిల్లులు రాక తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు. విజయ డెయిరీ సంస్థ అధికారుల తీరుపై రైతులు తీవ్రంగా మండిపడ్డారు. పాలకేంద్రం ఎదుట సుమారు గంటపాటు రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకోతో ఉదయం వేళ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ జామ్ కావడంతో ఎస్సై సందీప్ ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చించారు.



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై సందీప్

పాడి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డెయిరీ అధికారులను ఎస్సై కోరారు. దీంతో సమస్య పరిష్కారానికి డెయిరీ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ సంఘం అధ్యక్షుడు ఉదయ్ కుమార్, ఆనంద్, రవి, రైతులు శ్రీధర్‌బాబు, చౌదరి పాల్గొన్నారు.




• బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి ఊరేగింపు



• నృత్యప్రదర్శనకు సిద్ధంగా చిన్నారులు

అశ్వవాహనంపై శ్రీవారి ఊరేగింపు

- ఇందూరు తిరుమల ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మోపాల్, ఏప్రిల్ 3: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోగల ఇందూరు తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం అశ్వవాహనంపై శ్రీవారిని ఊరేగింపు నిర్వహించారు. స్వామివారి కీర్తనలపై ప్రముఖ నృత్య గురువులు విజయలక్ష్మి ఆధ్వర్యంలో అద్భుతమైన నృత్య రూపకాలను సిద్ధార్థ కళాక్షేత్రం శిష్యులు, సినీ నటుడు రవి ప్రదర్శించి భక్తులను అలరింపజేశారు. అనంతరం శ్రీ దేవనాథ జీయర్ స్వామి, గంగోత్రి రామానుజ స్వామి ప్రవచనలు చేశా రు. అశ్వవాహనంపై వచ్చిన శ్రీవారు సిరిసంపదలను తీసుకొని వస్తాడని తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఐదవ రోజు సాయంత్రం పూర్ణాహుతి తర్వాత అశ్వవాహనంపై మాడవీధుల్లో ఊరేగిన తర్వాత దోహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు నర్సింహారెడ్డి, శిరీష్, విజయసింహారెడ్డి, సినీ నటులు రవి, సాయిరెడ్డి, ఎంపీటీసీ రాములు, రవీందర్‌యాదవ్, నర్సారెడ్డి, ప్రసాద్, రమేష్, భాస్కర్, నరాల సుధాకర్, గంగారెడ్డి, సాయిలు, మురళి, పృథ్వీ, అరుణ్, అరవింద్, సత్యనారాయణచార్యులు, శ్రీకర్ కుమారాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు, విజయ్‌స్వామి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నియోజకవర్గాలకు కో ఆర్డినేటర్ల నియామకం

నిజామాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల కోసం పకడ్బందీగా పనిచేసేందుకు నియోజకవర్గాలకు కోఆర్డినేటర్లను కాంగ్రెస్ పార్టీ నియమించింది. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారాలు సజావుగా జరిగేందుకు వీరి నియామకాలను చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని తొమ్మిది నియోజకవర్గాలకు ఈ కో ఆర్డినేటర్లను నియమించారు. నియోజకవర్గాల్లో జరిగే ప్రచారాలతో పాటు పార్టీల చేరికలు ఇతర అంశాలు వీరు చూడనున్నారు. నేతలంతా సమష్టిగా పాల్గొనే విధంగా పనిచేయనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు ఉండటంతో పని చేసే వారికి అవకాశాలను కల్పించారు. ఆర్మూర్‌కు రాంభూపాల్, బోధన్‌కు మహ్మద్ ఇర్ఫాన్ అలీ, జుక్కల్‌కు మహ్మద్ ఇలియాస్, బాన్సువాడకు రాజేందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎల్లారెడ్డికి గజ్జి భాస్కర్ యాదవ్, కామారెడ్డికి చకిలం రాజేశ్వర్‌రావు, నిజామాబాద్ అర్బన్ ముప్పగంగారెడ్డి, నిజామాబాద్ రూరల్ సత్యనారాయణగౌడ్, బాల్కొండకు బండి శ్రీనివాస్‌లను నియమించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని కొరుట్లకు ప్రకాశ్‌ను, జగిత్యాలకు అబ్దుల్ ఎజాజ్‌లను నియమించారు. వీరి ఆధ్వర్యంలో కార్యక్రమాలను సజావుగా జరిగే విధంగా చూడనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నేతలు కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ఖిల్లా, ఏప్రిల్ 3: యువత మద్యం తాగి వాహనాలు నడపరాదని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జిల్లాలో పోలీస్ కళా బృందాలు ట్రాఫిక్ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. యువతతో పాటు విద్యార్థులకు వివిధ కళాశాలలో ప్రత్యేకంగా ఈ బృందాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. గత సంవత్సరం కాలంలో జిల్లాలో 767 రోడ్డు ప్రమాదాలు జరుగగా 337 మంది మరణించారన్నారు. ఈ రోడ్డు ప్రమాదాలన్నీ మద్యం తాగడం వల్లనే జరుగుతున్నాయన్నారు. వీటితో పాటు నేరాలు కూడా మద్యం మత్తులో చేస్తున్నారని తెలిపారు. మార్చి నెలలో జిల్లాలో 649 డ్రంకన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశామని వీటిలో 267 మందికి 10 నుంచి 14 రోజుల జైలు శిక్ష పడిందని తెలిపారు. యువత మద్యానికి బానిస కాకుండా ఉండాలని ఆయన కోరారు.

బీజేపీ మతతత్వ పార్టీని ఓడించాలి

పెద్దబజార్, ఏప్రిల్ 3:18వ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మతతత్వ పార్టీని ఓడించాలని హైకోర్టు రిటైర్డ్ న్యాయాధికారి చంద్రకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని మల్లుస్వరాజ్యం భవన్‌లో ద్వితీయ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మతాలలో చిచ్చుపెడుతూ రాజకీయాలను అస్థిరపరుస్తూ ఓట్ల కోసం దిగజారుడు రాజకీయాలను చేయడం మానుకోవాలని హితవు పలికారు. డాక్టర్ సూరి మాట్లాడుతూ 1976 42వ రాజ్యాంగ సవరణలో పొందుపర్చిన లౌకిక భావాన్ని సోషలిస్ట్ భావాలను భారత రాజ్యాంగం నుంచి తొలగించడమే కాకుండా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన ఈ భారత రాజ్యాంగాన్ని తొలగిస్తామని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్‌రావు, హుస్సేన్, రామారావు, గైని గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 6 నుంచి 10 వరకు ఉపాధి పనులు

ధర్పల్లి, ఏప్రిల్ 3: ఉపాధి హామీ పనులను ఉదయం 6 నుంచి 10 గంటల వరకే చేపట్టాలని ఎంపీడీవో బాలకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ వేడి వల్ల వడదెబ్బ సోకే అవకాశం ఉందని ఉదయం 6 నుంచి పనులు ప్రారంభించి 10 వరకు పూర్తి చేయాలన్నారు. పనులు జరిగే చోట ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, టెంట్లు, ప్రాథమిక చికిత్స కిట్లు ఉంచాలని సూచించారు. ప్రతీ గ్రామంలో 200 మంది కూలీలు తగ్గకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వినోద, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి చిన్నారులే రాబోయే రోజులకు మూల స్తంభాలు

బోధన్‌రూరల్,ఏప్రిల్3: చిన్నారుల్లో నిబిడీకృతమైన సృజనాత్మకతను వెలికితీసేందుకు ధారణ పేరుతో సంస్థను ఏర్పాటు చేశామని బోధన్‌కు చెందిన జ్యోతిష్య పండితులు ఉదయ్ శర్మ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజులకు నేటి చిన్నారులే మూలస్తంభాలు కాబట్టి వారిని సమాజంలో సభ్య సమాజాన్ని నిర్మానం చేసే దిశగా తయారు చేయాలని యోచిస్తున్నామన్నారు. మన వేదిక్ సంప్రదాయాలు తెలియని కారణంగా పిల్లలు సెల్‌ఫోన్‌లు, టీవీలు చూస్తూ ప్రాశ్చాత్య సంస్కృతి వైపు దృష్టి సారిస్తున్నారు. పిల్లలకు క్రమశిక్షణ, తెలివిని పెంచడంతో పాటు యోగ, ధ్యానం వంటి అంశాలను సమ్మిళితం చేసి ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందనే విషయంపై అవగాహన కల్పిస్తామన్నారు. లెక్కల్లో ధైర్యం చెదిరిపోకుండా సులభ రీతిలో పరీక్షల్లో విజయాలు సాధించే విధంగా తాము చిన్నారులను తయారు చేసేందుకు ధారణ ద్వారా కృషి చేస్తామన్నారు. వేసవి సెలవుల్లో భాగంగా ఈ నెల 29నుండి జూన్ 2వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తామని ఉదయ్ శర్మ తెలిపారు.

పిల్లలు వయసుకు తగ్గ బరువు ఉండేలా చూడాలి



పిల్లల ఆరోగ్య స్థితిని పరిశీలిస్తున్న దృశ్యం

మోస్రా,ఏప్రిల్3: పిల్లలు వయసుకు తగ్గ బరువు ఉండేలా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత పేర్కొన్నారు. బుధవారం మోస్రా మండల కేంద్రంలోని సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో 0నుండి 5సంవత్సరాల లోపు పిల్లల పోషణ స్థితిని గుర్తించే పరికరములపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల పిల్లల ఎత్తు, బరువు చూసి వారి పోషణ స్థితిని గుర్తించాలన్నారు. పిల్లలకు సరైన పోషకాహారం అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటు వేయొచ్చు

● దివ్యాంగులు వయోవృద్ధులకు మాత్రమే ఈ అవకాశం

డొంకేశ్వర్ ఏప్రిల్ 3: ఓటింగ్ పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి ఓటు వేస్తారు కానీ వారు ఇంటి నుంచి ఓటు వేయొచ్చు అందరు కాదండోయ్ పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి ఓటేసి స్థితిలో లేనివారు 85ఏళ్ల పైబడ్డ మంచానికి వీల్ చేరుకు పరిమితమైన వారు మాతరమే డొంకేశ్వర్ మండల పరిధిలో 511మంది అందుకు అర్హులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 85ఏళ్ల పైబడ్డ మంచానికి వీల్ చైర్‌కు పరిమితమైన వారిని ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పిస్తూ ఎన్నికల సంఘం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మండల అధికారులు కార్యచరణను వేగవంతం చేశారు. అర్హులను గుర్తించడంతో పాటు బూత్ లెవల్ అధికారి 12డి ఫారాలు పంపిణీ చేస్తున్నారు. ఈ ఫారం పూర్తి చేసి బూత్ లెవల్ అధికారి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ గడువు ముగిసేంత వరకు దరఖాస్తులను



మాత్‌పల్లిలో వృద్ధురాలికి ఫారం అందజేస్తున్న బీఎల్‌వో

అందించాలి. అనంతరం ఎన్నికల అధికారి పరిశీలించి ఇంటి నుంచి అవకాశం కల్పిస్తారు.మండలంలో బూత్ లెవల్ అధికారులు అర్హులకు సదరు ఫారం అందజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

● మండలంలో 19 పోలింగ్ కేంద్రాలు

డొంకేశ్వర్ మండలంలో 19 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండలం వ్యాప్తంగా 16116 ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 8982 మంది ఉన్నారు, పురుష ఓటర్లు7134ఉన్నారు. 85ఏళ్ల పైబడిన 161మంది దివ్యాంగులు 350 మంది మొత్తం511మంది ఓటర్లు ఉన్నారు వీరందరికి ఇంటి నుంచి ఓటేసి అవకాశం కల్పించేందుకు సంబంధిత అధికారులు ఫారాలు అంద జేస్తున్నారు.

● సద్వినియోగం చేసుకోవాలి

పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి ఓటు హక్కు వినియోగించుకోలేని స్థితిలో ఉన్న 85ఏళ్ల పైబడిన వారు దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. అర్హులు ముందుగా 12డిఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

మొదటి విడత పూర్తయిన ఈవీఎంల ర్యాండమైజేషన్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 3:పార్లమెంట్ సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ బుధవారం పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాలకు కేటాయించాల్సి ఉన్న కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ గురించి కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఈ ప్రక్రియ మొత్తాన్ని ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఖరారైన జాబితాను ప్రతినిధులకు, అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఈ జాబితా ఆధారంగానే జిల్లాలోని ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ శాసనసభ నియోజకవర్గాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లను కేటాయించడం జరుగుతుందని ఆయా సెగ్మెంట్‌లలోని స్ట్రాంగ్ రూమ్‌లలో కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని భద్రపరుస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం ఆరు నియోజకవర్గాల పరిధిలో 1550 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 25 శాతం అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు రిజర్వులో ఉంచడం కోసం కేటాయిస్తున్నామన్నారు. 40 శాతం వీవీప్యాట్లను రిజర్వులో ఉంచేలా అదనంగా కేటాయిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఎన్నికల సంఘం నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియ చేపడుతున్నామని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ ప్రక్రియలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దబజార్: రాబోయే రోజుల్లో విపరీతమైన వేడి గాలులు, వేడి వాతావరణం నెలకొంటున్న తరుణంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తమై వివిధ పనులు చేసేవారు ముఖ్యంగా ఎండలో పనిచేసే సాధారణ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుదర్శనం తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గోడప్రతులను ఆవిష్కరించారు.

జిల్లాపై భానుడి ప్రభావం

● 43 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత నమోదు
● జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 3:జిల్లాపై భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.గతంలో ఎన్నడులేని విధంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. బుధవారం జిల్లాలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరో నాలుగైదు రోజుల పాటు వాతావరణం ఇలాగే ఉండే అవకాశం ఉందని వడగాలులు వీచే అవకాశం ఉన్నం దున ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు. మే, జూన్ నెలలో గతంలో అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యేవి కానీ ఏప్రిల్ నెల మొదటి వారంలోనే 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పగటి పూట తో పాటు రాత్రిపూట ఉష్ణోగ్రతలు కూడా రికార్డు స్థాయిలో న మోదు అవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మాక్లూర్ మండలం లక్మాపూర్‌లో బుధవారం 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణో గ్రత నమోదైంది. మంచిప్పలో 42.4, వర్ని మండలం జాకోరాలో 42.2, కోటగిరిలో 42.1, ఎడపల్లిలో 41.9, బోధన్ మండలం బెల్లాల్‌లో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. జిల్లాలో 33 ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు బుధవారం నమోదు అయ్యాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో ఉదయం 11గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగింది

ఇందల్వాయి, ఏప్రిల్ 3: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో విశేష ఆదరణ పెరిగిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. బుధవారం ఇందల్వాయి మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అన్సాన్‌పల్లి గ్రామస్థులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అణచివేతలు తప్ప ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాపాలన కొనసాగిస్తున్నామని ఆయన చెప్పారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. రానున్న రోజుల్లో మరికొంత మంది మండలానికి చెందిన ముఖ్య కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న అన్సాన్‌పల్లి గ్రామస్థులు

ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, అన్సాన్‌పల్లి గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గోదావరిలో పడి ఒకరి మృతి

రెంజల్,ఏప్రిల్3: మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన నాయక్‌పోడ్ సాయికుమార్(21)అనే వ్యక్తి ప్రమాదవశాత్తు గోదావరి నదిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన సాయికుమార్ పశువులను కాసేందుకు గ్రామ శివారులో గల గోదావరి నది వద్దకు వెళ్లాడు. మంగళవారం సాయంత్రం వేళ పశువులను ఇంటికి తీసుకువస్తుండగా నది వైపుకు వెళ్లిన గేదెలు నీటిలో మునగగా వాటిని బయటకు తీసేందుకు ప్రయత్నించగా కాలుజారి నీటిలో పడడంతో ఈత రాక మృతి చెందాడు. బుధవారం ఉదయం జాలర్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. మృతుడు తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

బోధన్‌రూరల్,ఏప్రిల్3: బోధన్ పట్టణంలోని పాత బస్తీలో గల వంద స్తంభాల ఆలయం వెనుక గల చెట్టుకు షేక్. అబ్దుల్ వహీద్ ఖురేషి అలియాస్ బుడ్డు(25)అనే యువకుడు రెండు రోజుల క్రితం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. బుధవారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకుని కుళ్లిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 3: రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని ఉప్లూర్‌లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రైతులు దళారులకు వరి ధాన్యాన్ని విక్రయించకుండా ఎఫ్‌సీఐ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సూచించారు. ఎఫ్‌సీఐ ప్రమాణాలు పాటిస్తూ ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతుధరలను పొందాలన్నారు. అనంతరం మండలంలోని కోనాపూర్ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఎఫ్ఏక్యూ పారామీటర్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట భీంగల్ ఏడిఏ మల్లయ్య, ఇన్‌చార్జి ఏవో బి. లావణ్య, సింగిల్ విండో ఛైర్మన్‌లు రేగుంట దేవేందర్, బడాల రమేష్, డిప్యూటి తహసీల్దార్ భాస్కర్, ఏఈవోలు రమేష్, సాయిరాం, రైతులు బద్దం రమేష్, సీఈవో శంకర్, రాజు, గ్రామ రైతులుఉన్నారు.

అయోధ్య శ్రీరాముని పాదుకలకు ప్రత్యేక పూజలు

మాక్లూర్, ఏప్రిల్3: అయోధ్య శ్రీరాముని పాదుకలు బుధవారం మామిడిపల్లి గ్రామంలో వరసిద్ధి కోదండ రామాలయానికి తీసుకువచ్చారు. అట్టి పాదుకలకు గ్రామానికి చెందిన హన్మాన్ దీక్షపరులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్న దానం నిర్వహించి ఇతర గ్రామాలకు అయోధ్య రాముని పాదుకలు పంపారు. ఈ కార్యక్రమంలో గంగోనిసంతోష్‌తో పాటు హన్మాన్‌దీక్షపరులు,భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పాఠశాలకు బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోదావరి, ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి,ఏప్రిల్ 3: గత నెల29 నుంచి ఏప్రిల్ 1వరకు మహారాష్ట్రంలోని ఔరంగబాద్‌లో జరిగిన జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సుద్దపల్లికి చెందిన గంగోత్రి, నిషిత, లిఖిత పాల్గొని రాష్ట్ర జట్టును జాతీయ స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిపి బంగారు పతకాలు గెలుపొందారు. క్రీడకారులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ గోదావరి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలపడంలో గురుకుల పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించడం గర్వకారమన్నారు. భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా క్రీడకారులను ప్రిన్సిపాల్ గోదావరి, జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, వైస్ ప్రిన్సిపాల్ దీప్తివాణి, వనిత, నల్లూరి లత, కోచ్ మౌనిక, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొరం ట్రాక్టర్ పట్టివేత

నవీపేట,ఏప్రిల్3: మండలంలోని కమలాపూర్ నుండి నవీపేటకు అక్రమంగా తరలిస్తున్న మొరం ట్రాక్టర్‌ను పట్టుకోవడం జరిగిందని తహసీల్దార్ నారాయణ తెలిపారు. బుధవారం ఉదయం కమలాపూర్ శివారు నుండి నవీపేటకు మొరాన్ని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని మండల రెవెన్యూ కార్యాలయానికి తరలించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అక్రమంగా మొరం తరలిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

నిజామాబాద్ అర్బన్,ఏప్రిల్ 3:నగరంలోని క్లాసిక్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఈసా, ఎజాజ్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెండ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు, రత్నాకర్, మాజీ మేయర్ ఆకుల సుజాత, శేఖర్‌గౌడ్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ముస్లీంలు పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లీం మైనార్టీలకు ఎప్పుడు అండగా ఉంటుందని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ మైనార్టీలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలన్నారు.

టీయూ అధ్యాపకుడు అరెస్ట్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 3: నిజామాబాద్ జిల్లా తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని సౌత్ క్యాంపస్ (భిక్కనూరు)లో పని చేస్తున్న కెమిస్ట్రీ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌మత్తుపదార్థాల తయారీ కేసులో బుధవారం హైదరాబాద్‌లో పోలీసులుఅరెస్టు చేశారు. హైదరాబాద్ శివారు లో గల మెడికమ్ ల్యాబ్ సంస్థలో ఇతనికి భాగస్వామ్యం ఉందని ఔష ధ నియంత్రణ సంస్థ నిర్ధారణ చేసింది.దీంతో తెలంగాణ విశ్వవిద్యాల యం లో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ చట్ట వ్యతిరేక వ్యాపారం చేస్తూ పట్టు బడిన శ్రీనివాస్‌పై చర్యలు తీసుకునేందుకు వర్సిటీ అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఉన్నతాధికారులకు ఇప్పటికే సమాచారాన్ని అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధర్పల్లి, ఏప్రిల్ 3: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చెలిమెల నర్స య్య కుటుంబాన్ని బుధవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పరామర్శించారు. నర్సయ్య తల్లి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్ రాజ్, పుప్పాల సుభాష్, చెలిమెల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

టీయూలో రాష్ట్రీయ కళామంచ్ సింగిండి పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 3: తెలంగాణ యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కళామంచ్ సింగిండి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏబీ వీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివా కోరారు. బుధవారం టీయూలో వర్సిటీ కళాశాల వద్ద వాల్ పోస్టర్ ల కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి మాట్లాడారు. ఉస్మానియ వర్సిటీలో ఏప్రిల్ 20,21 తేదిల్లో సంస్కృతిక పోటీలను సింగిడి పేరుతో నిర్వహిస్తున్నమని ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ కళాను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దోహదం చేస్తుందన్నారు.ఈకార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సునీల్, కార్యవర్గ సభ్యులు నాగరాజు, అమృత్ పావని, పాల్గొన్నారు.

టీయూ సమస్యలను పరిష్కరించాలని సీఎంను కలిసి ఎన్‌ఎస్‌యూ అధ్యక్షుడు శ్రీశైలం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 3:సీఎం రేవంత్‌రెడ్డిని బుధ వారం ఎన్ఎస్ యూఐ వర్సిటీ అధ్యక్షుడు శ్రీశైలంను కలిసి తెలంగాణ విశ్వవిద్యాల యం సమస్య లను వివరించడం జరిగిందని శ్రీశైలం ఒకప్రకటనలో తెలిపారు. వర్సిటీ పై ప్రత్యేక శ్రద్ధతో నిధులు కేటాయించాలని గత పదేళ్ల కాలంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం వర్సిటీని పట్టించుకోక సర్వనాశనం చేసి పేద విద్యార్థులకు విద్యానుదూరం చేసిందని సీఎంకువివరించారు. వర్సిటీలో పనిచే స్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ గురించిసీఎంకు తెలిపానని వర్సిటీపాలక మండలి, నూతనరిజిస్ట్రార్ వీసీల నియామకం పారదర్శకంగా జరిపేల చూడాలని సీఎం ను కోరారు.ఇందుకు సీఎంకుసానుకులత వ్యక్త పరిచారని శ్రీశైలం తెలిపారు.

కారేగాంలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

కోటగిరి,ఏప్రిల్3: పోతంగల్ మండలంలోని కారేగాం ప్రాథమిక పాఠశాలలో బుధవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలు ప్రతి ఒక్కరికి ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన ఎంఈవో నాగనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. మండలంలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం,గంగాధర్, ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈపై బదిలీవేటు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 3:సోషల్ మీడియాలో ఓ పార్టీకి ప్రచారం చేస్తున్నారన్న ఫిర్యాదుపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఏఈని బదిలీ చేశారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఏఈగా పనిచేస్తున్న యశ్వంత్‌రావుపై ఓ పార్టీకి ప్రచారం చేస్తున్నారని సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు రావడంతో యశ్వంత్‌రావును బదిలీ చేశారు. వేల్పూర్ ఏఈగా ఉన్న యశ్వంత్‌రావును నిర్మల్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ బదిలీ ఆర్మూర్ డివిజన్ పరిధిలో సంచలనంగా మారింది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులే ఓ పార్టీకి వత్తాసుపలుకుతూ మెస్సేజ్ చేయడంతో ఆ మెస్సేజ్‌ను ఏఈ ఫార్వర్డ్ చేశారని సమాచారం. ఉన్నతాధికారులపై చర్యలు లేకుండా కేవలం ఏఈపై చర్యలు తీసుకోవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి.

గత సంవత్సర వేలమే ఖరారు

నవీపేట,ఏప్రిల్3: నవీపేట గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి శుక్రవారం జరిగే వారంతపు సంత, శనివారం జరిగే మేకల సంతలకు సంబంధించి ఇటీవల వేలంపాట నిర్వహించగా అప్‌సెట్ ధర రాకపోవడంతో గత సంవత్సరంకు సంబంధించిన వేలంపాటను ఉన్నతాధికారులు ఖరారు చేయడం జరిగిందని ఎంపీవో రామకృష్ణ తెలిపారు. గత సంవత్సరం వారంతపు సంత 15లక్షలు, మేకల సంత 55.16లక్షలు పలికింది. ఈ సంవత్సరం సంతలకు సంబంధించి మూడుసార్లు వేలంపాట నిర్వహించినప్పటికీ అప్‌సెట్ ధర రాకపోవడంతో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తిరిగి వేలంపాట నిర్వహించడం సాధ్యం కాదని రాబోయే 10వారాలకు సంబంధించి వారంతపు సంత, మేకల సంతలకు గత సంవత్సరం ప్రతి వారం ఎంత మొత్తంలో కిస్తీలు వసూలు చేశారో అదే మొత్తంలో ప్రస్తుతం కూడా వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఎంపీవో పేర్కొన్నారు.

టీయూలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి :రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి,ఏప్రిల్ 3: తెలంగాణ విశ్వవిద్యాలయంలో పోటీ పరీక్షల విభాగం డైరెక్టర్ రమణచారి ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలకు బుధవారం తరగతులను ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి మాట్లాడుతూ.. వైస్ చాన్సలర్ బుర్ర వెంకటేశం (ఐఏఎస్) రాష్ట్ర స్థాయిలోని ప్రసిద్ధ కోచింగ్ సెంటర్ నుంచి నిష్ణాతులైన అధ్యాపకులను ఆహ్వానించి విద్యార్థిని, విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని లైబ్రెరిలో పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారని రిజిస్ట్రార్ తెలిపారు.ప్రిన్సిపాల్ ఆరతి మాట్లాడుతూ.. సమయం వృథా చేయకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆమె సూచించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ... ఇండియన్ పాలిటి గురించి మాట్లా డుతు భారత రాజకీయలపై సమాగ్రమైన అవగహన కల్పించారు. నేటినుంచి విద్యార్థులు శిక్షణ తరగతులకు హాజరు కావలని కాంపిటెటివ్ సెల్ డైరెక్టర్ రమణ చారి అన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 3: ఛత్రపతి శివాజీ 344వ వర్ధంతి సందర్భంగా నగరంలోని శివాజీచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు, రత్నాకర్, భక్తవత్సలం, దయానంద్‌గుప్త, దిలీప్ పవార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ దేశం కోసం చేసిన త్యాగాలను జీవన్‌రెడ్డి కొనియాడారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మాక్లూర్, ఏప్రిల్3: ప్రజలు ఎలాంటి కష్టాలకు లోనుకాకుండా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దుర్గానగర్ కిందితండాలో అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితుల మధ్య పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాండాలలో ప్రకృతి ఆనందాలను ఆశ్వదిస్తూ ఉండాలన్నారు. అలాగే తాండాల్లో ప్రజలందరూ కలిసి సుఖ సంతోషాలతో పండగలు జరుపుకోవాలని అన్నారు. ఆలయానికి ప్రహరీ గురించి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తేగా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సురేష్‌నాయక్, రాజు, శేఖర్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

'లేబర్‌లకు రూ.300 పైనే ఇవ్వాలి'



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మోపాల్, ఏప్రిల్ 3:గ్రామ పంచాయతీలో లేబర్‌లుగా పనిచేస్తున్న వారికి కనీసం 300లకు పైగా ఇవ్వాలని, తాగునీరు అందుబాటులో ఉంచే విధంగా చూడాలని డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ తెలిపారు. బుధవారం మోపాల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ తాగునీరు అందరికీ అందుబాటులో ఉండే విధంగా చూడాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు గ్రామాల్లో తిరుగుతూ గ్రామ సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో లింగం, పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణకు డుమ్మా కొట్టిన టీచర్లకు నోటీసులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 3:పార్లమెంట్ ఎన్నికల కోసం నిర్వహిస్తున్న శిక్షణకు డుమ్మా కొట్టిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 1, 2 తేదీలలో జిల్లాలోని ఐదునియోజకవర్గాల పరిధిలో ఉపాధ్యాయులకు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లాలోని 84 మంది టీచర్లు గైర్హాజరు కాగా వారికి నోటీసులు జారీ చేశారు.ఎన్నికల విధులకు ఎందుకు గైర్హాజరు అయ్యారో కారణాలు తెలపాలని ఈనెల 4వ తేదీలోపు వివరణ ఇవ్వాలని లేకపోతే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.

● మొదలైన పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్

పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన స్పాట్ వాల్యుయేషన్ బుధవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని నిర్మల హృదయ పాఠశాలలో ఈనెల 10వ తేదీ వరకు 10వ తరగతి ప్రశ్నపత్రాల మూల్యాంకనం నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు. మూల్యాంకనంకు సంబంధించిన డ్యూటీలు ఉన్న ఉపాధ్యాయులంతా మూల్యాంకనంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

శుభకార్యాల్లో ఎమ్మెల్సీ

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్03: భీమ్‌గల్ మండలంలోని వివిధ వివాహ శుభకార్యాలలో బుధవారం ఎమ్మెల్సీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ గౌడ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత భీమ్‌గల్‌కి మొదటి సారిగా విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ఘనంగా సన్మానించారు.

నేటి తరానికి దొడ్డి కొమురయ్య ఆదర్శం

● నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



● కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న ధన్‌పాల్

పెద్దబజార్, ఏప్రిల్ 3: దొడ్డికొమురయ్య లాంటి యోధుల పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో తెలంగాణ భగత్‌సింగ్‌గా పేరు పొందిన దొడ్డికొమురయ్య 96వ జయంతిని ఘనంగా నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ దొరల గడీల పాలనకు వ్యతిరేకంగా నిజాం నిరంకుశ పాలనకు ఎదురు తిరిగి రజాకార్ల వెన్నులో వణుకు పుట్టించిన యోధుడు దొడ్డికొమురయ్య అని అన్నారు. తెలంగాణతల్లి బానిస సంకెళ్ల తెంచడానికి ఎంతో మంది యోధులు తమ ప్రాణాలను అర్పించారని అందులో దొడ్డికొమురయ్య మొదటివారని తమ వర్గంలో ప్రజలను చైతన్యం చేయడమే కాకుండా వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులుగా అమరులైన వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, బీజేపీ నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, స్రవంతిరెడ్డి, కార్పొరేటర్లు మమత ప్రభాకర్, మాస్టర్ శంకర్, మల్లేష్‌యాదవ్, ఆకుల హేమలతశ్రీనివాస్, కిశోర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● ఉచిత అంబలి పంపిణీ

ధన్‌పాల్ లక్ష్మీబాయి అండ్ విఠల్ గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం నగరంలోని దేవిరోడ్ చౌరస్తా వద్ద ఉచిత అంబలి పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందూరు పట్టణం కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి నగరానికి వచ్చే వారికి తన ట్రస్ట్ ద్వారా ఉచిత అంబలి వితరణ చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వృద్ధులు, చిన్నపిల్లలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంబలి, జావా లాంటి పానియాలు తీసుకోవడం ద్వారా ఎండదెబ్బ తగలకుండా ఉండవచ్చని ఆయన అన్నారు. తన ట్రస్ట్ ద్వారా ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడు ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్ యజమాని పార్శి రమేష్, బీజేపీ నాయకులు ప్రభాకర్ గుప్త, భాస్కర్, హరీష్‌రెడ్డి, ఆనంద్, రోషన్ లాల్‌బోరా, తదితరులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

● హిందూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు సిద్ధం చేసిన యోధుడు

హిందూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు సిద్ధం చేసిన యోధుడు ఛత్రపతి శివాజీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. బుధవారం నగరంలోని శివాజీనగర్ హమాల్‌వాడి చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహరాజ్ 344వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరాఠా యోధుడు నవభారతానికి స్ఫూర్తిప్రదాత ఛత్రపతి శివాజీ మహరాజ్ అని ఆకాలంలో మన భారత దేశాన్ని పట్టిపీడిస్తున్న మొఘులు ఔరంగజేబులాంటి వారు హిందూ దేవాలయాల పైన, హిందూ ఆడబిడ్డలపైన దాడులు చేస్తుంటే హిందువులను బానిసలుగా వ్యవహరిస్తున్న తరుణంలో ఈ భారతమాత సంకెళ్ల తెంచడానికి షాహాజీ, జిజియాబాయ్ దంపతులకు జన్మించిన యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని అన్నారు. ఛత్రపతి శివాజీ ఆయన 17 ఏళ్ల నుంచే తన యుద్ధ నీతితో గెరిల్లా సైన్యాన్ని తయారు చేసుకొని తురుష్కులను, మొఘులను తరిమికొట్టి వారి గుండెల్లో సింహస్వప్నం నిద్రపోయిన యోధుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో 35,36 డివిజన్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనులకు బీఆర్ఎస్, బీజేపీ చేసిందేమీ లేదు

● 7న జిల్లా స్థాయి గిరిజన కాంగ్రెస్ సమావేశం : జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ కేతావత్ యాదగిరి



మాట్లాడుతున్న కేతావత్ యాదగిరి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 3:రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలు గిరిజనుల అభివృద్ధి కోసం చేసిందేమీ లేదని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీలు కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికే మద్దతు ఇస్తారని జిల్లా ఎస్టీసెల్ చైర్మన్ కేతావత్ యాదగిరి అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదివాసీలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆదివాసీలు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తారన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆదివాసీలు జీవన్‌రెడ్డికి మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఆయన అన్నారు. ఈనెల 7న నగర శివారులోని బృందావన్ గార్డెన్‌లో నిజామాబాద్ జిల్లా స్థాయి ఆదివాసీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రతి తండా, ప్రతీ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో గిరిజన బంధువులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. అందరూ ఏకమై గిరిజనుల సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ మోసపూరిత మాటలు చెప్పి గత పదేళ్లుగా గిరిజనులను మోసం చేసిందని ఎంపీ అరవింద్ సైతం గిరిజనుల తండాలకు నిధులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమైందని ఇందిరమ్మ ఇళ్లు, రుణాలు, తండాలలో రోడ్లు, తాగునీటి సరఫరా తదితర కార్యక్రమాలన్నీ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే జరిగాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బంజారా సేవా సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు తారాచంద్‌నాయక్ మాట్లాడుతూ గిరిజనులంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికే మద్దతు తెలపాలని ప్రతీ ఒక్కరు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు సుభాష్‌జాదవ్, ప్రకాశ్‌నాయక్, రాజు, బాల్‌రాజ్‌నాయక్, మాంగ్యా నాయక్, సురేష్ నాయక్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఏ విద్యార్థి సంఘంలో చేరిక



ఏఐఎస్ఏ విద్యార్థి సంఘంలో చేరిన నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 3: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సమరశీల పోరాటాల నిర్మాణానికై ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా బుధవారం జిల్లాకు చెందిన ఏబీవీపీ నాయకులు ఏఐఎస్ఏ విద్యార్థి సంఘంలో చేరారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ వద్ద జిల్లాకు చెందిన జ్వాలా, కిరణ్‌లు ఏఐఎస్ఏలో చేరారు. ఈ సందర్భంగా రమేష్‌రాజా మాట్లాడుతూ.. విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా.. నూతన జాతీయ విద్యావిధానం రద్దుకు, అదే విధంగా ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన జేఎన్‌టీయూ ఎన్నికల్లో ఏఐఎస్ఏ విద్యార్థి సంఘం నుంచే అధ్యక్షుడిగా ఎన్నిక కావడం జరిగిందన్నారు. కిరణ్, జ్వాలాలకు ఏఐఎస్ఏ తెలంగాణ రాష్ట్ర కమిటీ బాధ్యతలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అపూర్వ, తనుశ్రీ, మేఘన, హర్షిత, తదితరులు ఏఐఎస్ఏలో చేరారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



తాళ్లరాంపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

మాక్లూర్ , ఏప్రిల్3: రైతులు తాము పండించిన పంటలకు కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని కల్లెడి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకంలో ఏలాంటి మోసా లకు పాల్పడవద్దని, తరుగు తీయవద్దని, ఏమైన అక్రమాలు చోటు చేసుకుంటే చర్యలు తప్పవని ఆయన సిబ్బందికి హెచ్చరించారు. అంతేగాకుండా వేసవి దృష్ట్యా రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. హామీలు, ట్రాలీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు రైతులు తీసుకువచ్చిన దాన్యాన్ని కొను గోలు కేంద్రాలకు తరలించాలని అన్నారు. రైతుల శ్రేయస్సు దృ ష్ట్యా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్‌రావు, ఎ.పాపయ్య, క్లస్టర్ సత్యనారా యణ, మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్‌సింగ్, సంఘ అధ్యక్షు డు బూ రోల్ల అశోక్, కార్యదర్శి సంతోష్, డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్ తెలిపారు. బధవారం మండలంలోని తాళ్లరాంపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ధేశించిన ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని తీసుకొచ్చి ఏ గ్రేడు రూ. 2203లు, బిగ్రేడు రూ. 2183లు పొందాలని సంఘం సీఈ వో గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో అబ్దుల్ మాలిక్, సాయి సచిన్, సంఘ పరిధిలోని రైతులు పాల్గొన్నారు

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఖిల్లా డిచ్ పల్లి సొసైటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు వరి ధాన్యం దళారులకు విక్రయించుకోకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రాల్లో విక్రయాలు చేసుకోని లబ్ధి పొందాలని డైరెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థిని అభినందించిన డీఐఈవో



విద్యార్థి మర్రి హర్షను అభినందిస్తున్న డీఐఈవో

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 3:నగరంలోని వినాయక్‌నగర్‌లో గల నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థి మర్రి హర్ష జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.62 పర్సంటైల్ మార్కులు సాధించిన సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఐఈవో రవికుమార్ బుధవారం అభినందించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నారాయణ కళాశాల యాజమాన్యం డీఐఈవోను సన్మానించింది. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన విద్యార్థి మర్రి హర్ష రికార్డు స్థాయిలో జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ మార్కులు సాధించినందుకు అభినందించారు. భవిష్యత్తులో నిజామాబాద్‌లో ఐఐటీ, నీట్ జాతీయ స్థాయి ర్యాంకులు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి, కోర్ డీన్ ప్రసాద్, కళాశాల ఏవో శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగితే..

పోలీసులకు సమాచారం ఇవ్వాలి

ఖిల్లా,ఏప్రిల్ 3:నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో అన్ని గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు. అనుమానాస్పదంగా తిరిగిన గుర్తుతెలియని వారు కనిపించిన పోలీస్ స్టేషన్‌తో పాటు 100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఎవరిని పట్టుకొని కొట్టవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అలా కొడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ మధ్యనే కొన్ని కేసులు ఆ విధంగా జరిగాయని ఆవేశానికి వెళ్లి కేసుల పాలు కావద్దని ఆయన కోరారు. సమాచారం ఇవ్వగానే పోలీసులు వచ్చి విచారిస్తారని ఆయన తెలిపారు.

బోధన్ బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

బోధన్‌రూరల్,ఏప్రిల్3: బోధన్ బార్ అసోసియేషన్ పూర్తిస్థాయి కార్యవర్గ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈరడి పోశెట్టి, కార్యదర్శి ఎస్ఎస్ఆర్ కోటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు సయ్యద్ అఫ్సర్ పాషా, సంయుక్త కార్యదర్శి వాజిద్ హుస్సేన్, అధికారి ఎం.శ్రీధర్ బాబు, లైబ్రేరి సెక్రటరీ ఆరీఫొద్దీన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు డీఎస్ అనిల్‌కుమార్, రాహుల్, పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకున్నారని అధ్యక్షులు ఈరడి పోశెట్టి తెలిపారు. క్రీడ సాంస్కృతి కార్యదర్శిగా డాక్టర్ పల్నాటి సమ్మయ్య, మహిళ ప్రాతినిధురాలిగా మాధవీలత, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎస్.,గంగాధర్ గౌడ్, ఎస్.రాములు, నియమాకం చేసినట్లు అధ్యక్షులు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.235	రూ. 275

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.70,200	రూ.64,750	రూ.810

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : టిల్లు స్క్వేర్ (10.10, 1.10, 7.50, 10.50)
: ఓం భీమ్ భుష్ (4.40)
స్ర్కీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (12.00, 2.40)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (ఇంగ్లీష్) (5.20, 8.00, 10.40)
స్ర్కీన్-3 : ది గోట్ లైఫ్ (12.05, 7.00)
: రజాకర్ (3.45)
: ఓం భీమ్ భుష్ (10.40)
స్ర్కీన్-4 : క్రూ (హిందీ) (10.45, 1.35, 7.40, 10.30)
: ప్రేమలు (4.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : టిల్లు స్క్వేర్ (10.45, 1.40, 4.35, 7.30, 10.25)
స్ర్కీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (10.45, 1.50, 4.30, 7.30, 10.30)
స్ర్కీన్-3 : ది గోట్ లైఫ్ (1.15, 7.30)
: కలియుగ పట్టణంలో (4.30)
: ఓం భీమ్ భుష్ (7.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్: ఓం భీమ్ భుష్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : గాడ్జిల్లా అండ్ కాంగ్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్